సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 28 । మే । 2023



తుది దశకు భూ సర్వే

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద తాడేపల్లిగూడెం పట్టణంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన సర్వే తుది దశకు చేరుకుంది. 8లో ▸



ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ

ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని 17వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ యాదవ్ అన్నారు. 8లో ▸



గంజాయి రవాణా.. వ్యక్తి అరెస్ట్

ఏలూరులో మోటార్‌సైకిల్‌పై గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, 24 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

చినవెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి సుజాతకు వేద ఆశీర్వచనాన్ని అందిస్తున్న ఆలయ ప్రధానార్చకులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శనివారం రాత్రి సందర్శించారు. కుటుంబసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి చినవెంకన్న మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ

వీరవాసరం: స్థానిక ఎంఆర్‌కే ఉన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక (రెమెడియన్) తరగతులను డీఈఓ ఆర్.వెంకటరమణ శనివారం పరిశీలించారు. తరగతులకు 110 మంది విద్యార్థులకు 45 మంది మాత్రమే హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులంతా హాజరయ్యేలా చూడాలని హెచ్‌ఎం బి.ప్రభామంజరిని ఆదేశించారు. శృంగవృక్షం, విస్సాకోడేరు, గొరగనమూడి హైస్కూళ్లలో తరగతులు పరిశీలించామన్నారు. అనంతరం ఎంఆర్‌కే హైస్కూల్‌లోని జేవీకే–4 స్టాక్ పాయింట్లను పరిశీలించారు.

తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి ఆర్డీఓగా సూర్యతేజ



ఎం.సూర్యతేజ, సబ్ కలెక్టర్

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెంలో నూతనంగా ఏర్పాటైన రెవెన్యూ డివిజన్‌కు ఇన్‌చార్జి ఆర్డీఓను నియమిస్తూ కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజను ఇక్కడ ఇన్‌చార్జి ఆర్డీఓగా నియమించారు.

పండ్లు, పూల సాగుకు తోడ్పాటు

భీమవరం(ప్రకాశం చౌక్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్లు, పూల సాగుకు రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనుందని డ్వామా పీడీ ఎస్‌టీవి రాజేశ్వరరావు తెలిపారు. మామిడి, చీనీ, దానిమ్మ, సపోట, చింత, జామ, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ, మల్లె, కొబ్బరి, మునగ తదితర పంటల సాగుకు తోడ్పాటు అందిస్తారన్నారు. దుక్కుదున్నడం, మొక్కల కొనుగోళ్లు, మొక్కలు నాటడం, నీరు పెట్టడం, ఎరువులు తదితర వాటి కోసం విడతల వారీగా మూడు నుంచి నాలుగేళ్లపాటు ఆర్థిక సాయం అందిస్తారన్నారు. పంటల వారీగా మామిడికి రూ.1,02,758, చీనీకి రూ.1,05,521, నిమ్మకు రూ.1,41,515, దానిమ్మకు రూ.2,48,845, జామకు 1,41,515, తైవాన్ జామకు రూ.2,30,023, సపోటకు రూ.88,255, చింతకు రూ.89,120, నేరేడుకు రూ.18,124, కొబ్బరికి రూ.88,821, సీతాఫలంకు రూ.1,70,603, ఆపిల్‌బేర్‌కు రూ.1,06,962, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.1,79,626, గులాబీకి రూ.1,92,500, మల్లెకు రూ.1,09,672, మునగకు రూ.1,01,541 చొప్పున ఆర్థిక సాయం అందిస్తారన్నారు. సొంత భూమి గల రైతులు ఉపాధి హామీ పథకం టీఏను సంప్రదించి ఎంపీడీఓ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సచివాలయం.. సేవల నిలయం

ప్రజల ముంగిటే ప్రభుత్వ సేవలు

- అందుబాటులో 545 రకాల సేవలు
- ఉమ్మడి జిల్లాలో 1,140 సచివాలయాలు
- 9,410 మందికి శాశ్వత ఉద్యోగాలు
- 19,723 మంది వలంటీర్ల నియామకం
- నాలుగేళ్లలో ప్రభుత్వం సాధించిన అభివృద్ధి

జిల్లా	సచివాలయాలు	ఉద్యోగులు	వలంటీర్లు
ఏలూరు	605	5,045	10,523
పశ్చిమగోదావరి	535	4,365	9,200
మొత్తం	1,140	9,410	19,723



ఏలూరులోని తాపీమేస్త్రి కాలనీలోని వార్డు సచివాలయాల వద్ద ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ప్రతి చిన్న పనికీ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పనిలేదు.. పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన పరిస్థితి అసలే లేదు.. మహాత్ముడు కలలగన్న గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిళ్లలోకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. ఇలా ఒకటి కాదు రెండు కాదు 545 రకాల సేవలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా అందించడంతో పాటు ఠంచన్‌గా ప్రతి నెలా ఒకటో తారీఖునే ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇదంతా సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో సచివాలయ వ్యవస్థ ద్వారా సాధించిన అభివృద్ధి.

ఉమ్మడి జిల్లాలో సూపర్ సక్సెస్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఖర్చు లేకుండా, రోజుల తరబడి ఎదురుచూపులు, 30 నుంచి 40 కిలోమీటర్లు మండల కేంద్రానికి వెళ్లే పనిలేకుండా అన్ని సేవలు పల్లె ముంగిటకే తెచ్చారు. దీంతో పాటు వేలాది మంది యువతకు వారి సొంత ప్రాంతాల్లోనే ప్రభుత్వ కొలువుల అందించేలా అమలుచేసిన సచివాలయ వ్యవస్థ జిల్లాలో సూపర్ సక్సెస్ అయ్యింది. వీటిద్వారా తహసీల్దార్ కార్యాలయాలకు పని భారం తగ్గడంతో పాటు ప్రతి ఫిర్యాదు సిటిజన్ చార్ట్‌లో నిబంధనలకు అనుసరించి పూర్తి కావడం, ఒకవేళ ఇబ్బందులున్నా వలంటీర్ల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం సత్ఫలితాలనిస్తోంది.

దరఖాస్తు నుంచి ధ్రువీకరణ పత్రం వరకు..

సచివాలయాల ద్వారా 545 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. కొత్త పెన్షన్ దరఖాస్తు మొదలుకొని భూసర్వేకు సంబంధించి ధ్రువీకరణపత్రం వరకూ అన్ని సచివాలయాల్లోనే పూర్తవుతున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, పెన్షన్లు, కుల ధ్రువీకరణ పత్రాలు, పన్నుల వసూళ్లు, బిల్లుల చెల్లింపులు, నవరత్న పథకాల దరఖాస్తులు, ఈకేవైసీ ఇలా సమస్త ప్రభుత్వ సేవలు ఇక్కడి నుంచే ప్రజలకు అందుతున్నాయి. 2019 అక్టోబర్ 2న ప్రారంభమైన సచివాలయ వ్యవస్థ విజయవంతంగా సాగుతోంది. ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు సచివాలయాల ద్వారా 25,06,293 అర్జీలను పరిష్కరించారు. ఇప్పుడు కొత్తగా ఆధార్ సేవలను కూడా ఎంపిక చేసిన సచివాలయాల్లో అందిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ, వెనుకబడిన తరగతులు, రెవెన్యూ, సర్వే, పౌరసరఫరాలు, దేవదాయ, గృహనిర్మాణం, వైద్య, పరిశ్రమ, కార్మిక, శాంతిభద్రతలు, విద్య, వ్యవసాయ, పశుసంవర్థక, రవాణా, విద్యుత్, పర్యాటక, యువజన, క్రీడ, మత్స్య, సాంకేతిక విద్య, గిరిజన, సాంఘిక, బీసీ, వాణిజ్యపనులు తదితర శాఖల పనులు సచివాలయాల ద్వారా అందుతున్నాయి.

29 వేల మందికి ఉపాధి

దేశంలోనే ఏ ఇతర రాష్ట్రంలో లేనివిధంగా జగన్ సర్కారు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 9,410 మందికి మందికి శాశ్వత ప్రభుత్వ కొలువులు, 19,723 మంది వలంటీర్ల నియామకం ద్వారా మొత్తంగా ఏకకాలంలో 29,133 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఇటీవల సచివాలయ ఉద్యోగులకు ప్రొబిషనరీ కూడా డిక్లేర్ చేయడంతో శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు



గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు ప్రజలకు నేరుగా సేవలందించేందుకు మార్గం సుగమమైంది. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందుతున్నాయా లేదా అని చూసే వెసులబాటు కలుగుతుంది. నేరుగా సచివాలయాలను సందర్శించి ప్రజలకు అందుతున్న లబ్ధి గురించి పరిశీలించే అవకాశం ఏర్పడింది.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

గ్రామస్థాయిలోనే ఉపాధి



గ్రామాల్లోనే ప్రజలకు సేవలు అందుతున్నాయి. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి దళారుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు చేరుతుంది. నిరుద్యోగులకు సైతం గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉద్యోగాలు కల్పించారు. ప్రజల అభివృద్ధిని, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని నేరుగా సమీక్షించే వెసులుబాటు కలిగింది.

– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి

సొంతూరులో ఉద్యోగం



పీజీ చదివిన నేను పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవాడిని. సచివాలయ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో తొలి ప్రయత్నంలోనే సొంతూరులోనే ఉద్యోగం సాధించాను. ఇటీవలే ప్రొబిషనరీ పీరియడ్ పూర్తి చేసుకుని పర్మినెంట్ ఉద్యోగిగా మారాను. ప్రజలకు సేవలందిస్తున్నాననే సంతృప్తితో పాటు సొంత ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేయడం ఆనందంగా ఉంది.

– చెన్నాపురపు శివరామ్, 38వ డివిజన్ వెల్ఫేర్ సెక్రటరీ, ఏలూరు

ప్రభుత్వ కొలువు నా కల



నేను బీటెక్ పూర్తి చేసి ఓ ప్రైవేటు కంపెనీలో చిన్నపాటి ఉద్యోగం చేసేవాడిని. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కల ఉండేది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ఉద్యోగాలు భర్తీ చేయడంతో నాకు విలేజ్ సర్వేయర్‌గా ఉద్యోగం వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగం అందులోనూ స్థానికంగా లభించడం చాలా సంతోషంగా ఉంది.

– కేతా స్వామి, విలేజ్ సర్వేయర్, వేంద్ర సచివాలయం, పాలకోడేరు మండలం

నైపుణ్యంతో వైద్య వృత్తిలో రాణింపు

కలెక్టర్ ప్రశాంతి



ఎంఎల్‌హెచ్‌పీలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్

సాక్షి, భీమవరం: వైద్య సేవలందించడంలో నైపుణ్యం అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం భీమవరం శ్రీవిష్ణు దంత కళాశాల ఆడిటోరియంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)కు నిర్వహించిన బేసిక్ లైఫ్ సపోర్ట్ వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్య విద్యలో మెలకువలతో కూడిన నైపుణ్యం సాధించినప్పుడే వృత్తిలో రాణించగలమన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు పనిచేసే చోటు నివాసముంటూ రోగులకు మెరుగైన సేవలందించడం ద్వారా గుర్తింపు పొందవచ్చన్నారు. సీపీఆర్, నొప్పి లేకుండా ఇంజక్షన్ చేసే విధానాలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన 346 మందిని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా నేషనల్ హెల్త్ మిషన్ ప్రాజెక్టు కింద జిల్లాలో నియమించగా వీరంతా గ్రామస్థాయిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్‌లో పనిచేస్తున్నట్టు చెప్పారు. శిక్షణ పూర్తిచేసుకున్న ఎంఎల్‌హెచ్‌పీలకు ఆమె సర్టిఫికెట్లు అందించారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, అడిషనల్ డీఎంహెచ్‌ఓ భానునాయక్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ నోడల్ అధికారి డాక్టర్ కీర్తి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

బాల్య వివాహాలు అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంక్షేమం, విద్య కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరం విష్ణు కళాశాల ఆడిటోరియంలో 'సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, సంక్షేమ పథకాలు' అనే అంశంపై ఏర్పాటుచేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంక్షేమం, విద్యా కార్యక్రమాలు అమలు చేయడంలో కార్యదర్శులు కీలకంగా వ్యవహరించాలన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలు బడిబయట ఉండరాదని, విద్యార్థులు ట్యాబ్‌లను ఎలా ఉపయోగించుకుంటున్నారో పరిశీలించాలన్నారు. తల్లిదండ్రులు ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్లినప్పుడు వారి పిల్లల కోసం ఏర్పాటుచేసిన తాత్కాలిక వసతి గృహాలను వినియోగించుకోవాలన్నారు. భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్ మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లల కోసం ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాలకు నిర్వహిస్తుండగా తల్లిదండ్రులు లేని పిల్లలను హోమ్స్‌కు పంపిస్తున్నట్లు చెప్పారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సొంతిల్లు ప్రభుత్వ లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



మహిళలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద కోరుమిల్లి గ్రామ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలందరికీ సొంతిల్లు అందించేలా సీఎం జగన్ కార్యాచరణ అమలు చేస్తున్నారన్నారు. స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.2.25 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. రాజధాని అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తానంటే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శతవిధాలా అడ్డుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కేసులు గెలిచి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో సీఎం జగన్ సఫలీకృతులయ్యారన్నారు. పెత్తందారుల మధ్య పేదలుండకూడదని చంద్రబాబు కుట్ర పన్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్య యుద్ధమని వాఖ్యానించారు. పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడితే పెత్తందారులకు టీడీపీ వత్తాసు పలుకుతోందని ధ్వజమెత్తారు. కోరుమిల్లిలో అపరిష్కృతంగా ఉన్న పేదలకు ఇంటి స్థలాలు విషయమై కలెక్టర్‌తో చర్చించి పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలోనే వీరందరికీ ఇంటి నిర్మాణం ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి, ముప్పిడి సంపత్‌కుమార్, సర్పంచ్ తాడేపల్లి చంద్రకళ, వల్లూరి బ్రహ్మానందం, చుండ్రు సర్వేశ్వరరావు, ముప్పిడి సరోజిని, చిలక వెంకట్రావు, ముప్పిడి సుబ్బారావు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..



అదుపు తప్పిన కారు

ఉంగుటూరు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అయినవిల్లిలో దైవ దర్శనం చేసుకుని తిరిగి వెళుతుండగా మార్గమధ్యంలో జాతీయరహదారిపై నాచుగుంట వద్ద కారు అదుపుతప్పిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. అయినవిల్లి నుంచి గుడివాడ వెళుతున్న కారు నాచుగుంట రేవు సమీపించే సరికి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న తమ్మన రాజేష్ (డ్రైవర్), అతడి తల్లి నాగలక్ష్మి, నతుకుల ఉపేంద్ర అతని తండ్రి సుబ్బారావుకు గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరితో పాటు మరో చిన్నారి, మహిళ కారులో ఉన్నా వారికి ఎటువంటి గాయాలు కాలేదు. వీరంతా గుడివాడు, నూజివీడు ప్రాంతాల నుంచి అయినవిల్లికి దైవ దర్శనానికి వెళ్లారు. డ్రైవర్ కునికపాట్లు పడటంతోనే ప్రమాదం జరిగిందని తెలిసింది. చేబ్రోలు ఎస్సై స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1.12 లక్షల మందికి రైతు భరోసా

- రైతుల ఖాతాల్లో రూ.84 కోట్ల జమ
- ఈనెల 30న నిధుల విడుదల
- ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.23.64 లక్షల అందజేత
- ఏర్పాట్లు పూర్తి చేసిన వ్యవసాయ శాఖ



గొరగనమూడి రైతు భరోసా కేంద్రంలో లబ్ధిదారుల జాబితాను సరిచూసుకుంటున్న రైతులు

సాక్షి, భీమవరం: వ్యవసాయాన్ని పండుగ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. రైతులకు సీజన్ ప్రారంభం నుంచి పంట విక్రయాల వరకు అన్నిరకాలుగా అండగా ఉంటోంది. దీనిలో భాగంగా రానున్న సార్వా సీజన్‌కు పీఎం కిసాన్–వైఎస్సార్ రైతు భరోసా పథకంలో సాగు పెట్టుబడి సాయం అందించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30న తొలి విడత రైతు భరోసా సాయం రూ.7,500 చొప్పున రైతులకు అందించనున్నారు. ఈ మేరకు జిల్లాలో 1,12,161 మంది రైతుల ఖాతాల్లో నగదు జమచేయనున్నారు. నాలుగేళ్లుగా ఈ పథకం కింద ప్రభుత్వం ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయంగా అందిస్తోంది.

మూడు విడతల్లో సాయం

రైతులకు సాగు పెట్టుబడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రూ.13,500 సాయం అందిస్తున్నారు. దీనిలో తొలి విడతగా మే 30న రూ.7,500, రెండో విడతలో రూ.4 వేలు, మూడో విడతలో రూ.2 వేల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నారు. భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కౌలు రైతులకు కూడా ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది.

1.21 లక్షల మందికి..

జిల్లాలోని 20 మండలాల్లో సుమారు 1.20 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా ప్రస్తుత సీజన్‌లో 1,12,161 మంది రైతులకు సుమారు రూ.84.12 కోట్లను రైతు భరోసా పథకంలో మొదటి విడతగా అందించనున్నారు. ఈ మేరకు లబ్ధిదారుల జాబితాలను గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు.

పంట నష్టపరిహారంగా..

ప్రస్తుత దాళ్వా పంట మాసూళ్ల సమయంలో కురిసిన అకాల వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని ఇరగవరం, అత్తిలి తదితర ఎనిమిది మండలాల్లో వర్షాలకు వరి పంట దెబ్బతిన్నట్టు గుర్తించారు. సుమారు 400 ఎకరాల్లో పంట దెబ్బతిందని అంచనా వేసి 305 మంది రైతులకు సుమారు రూ.23.64 లక్షలను ఇన్‌పుట్ సబ్సిడీగా అందించనున్నారు.

305 మంది ఇన్‌పుట్ సబ్సిడీ



జిల్లాలోని సుమారు 1.21 లక్షల మంది రైతులకు దాదాపు రూ.84 కోట్లను వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద వారి ఖాతాల్లో ప్రభుత్వం జమచేయనుంది. దీంతో పాటు దాళ్వా సీజన్‌లో అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న 305 మంది రైతులకు రూ.23.64 లక్షల నగదును ఇన్‌పుట్ సబ్సిడీగా అందించనుంది.

–జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

ఏటా పెట్టుబడి సాయం



వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా పెట్టుబడి సాయంగా నగదు అందించడం రైతులకు ఎంతో మేలు చేస్తుంది. నాలుగేళ్లుగా ఏటా మూడు సార్లు మాకు సాయం అందుతోంది. దీంతో వరి సాగు ప్రారంభంలో విత్తనాల కొనుగోలు, పొలాన్ని దదును చేసుకోవడం వంటి పనులకు ఇబ్బంది ఉండటం లేదు.

– నెలపర్తి ప్రకాష్, కౌలు రైతు, కాళ్ల

క్లుప్తంగా

ట్రావెల్స్ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం


ఘటనా స్థలంలో షరోన్ మృతదేహం

ఆకివీడు: జాతీయ రహదారిపై ఉప్పుటేరు వంతెన వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంకు చెందిన జాన్ షరోన్ (17) ఇటీవల ఇంటర్ పూర్తి చేసి విశాఖపట్టణంలో ఎయిర్ ఫోర్స్‌లో శిక్షణకు ఎంపికయ్యాడు. ఈ క్రమంలో విశాఖపట్టణం నుంచి రైలులో శనివారం బయలుదేరి ఆకివీడు స్టేషన్‌లో దిగాడు. కృష్ణా జిల్లా తాడినాడకు చెందిన స్నేహితుడు విజయబాబుతో కలిసి అతని ఇంటికి వెళ్లేందుకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరారు. షరోన్ మోటార్‌సైకిల్ నడుపుతున్నాడు. ఉప్పుటేరు వంతెన సమీపంలో మలుపు వద్దకు వచ్చేసరికి కైకలూరు నుంచి ఆకివీడు వైపు వేగంగా వస్తున్న ట్రావెల్స్ బస్సు మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టగా, కింద పడిన షరోన్ పైనుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో షరోన్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా, స్నేహితుడు విజయబాబుకు తీవ్రగాయాలయ్యాయి. అతనిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై కె.రాజారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ రవిప్రకాష్, డీఎస్పీ శ్రీనాథ్ పరిశీలించారు.

తుది దశకు భూహక్కు సర్వే

- ఫైలెట్ ప్రాజెక్టుగా తాడేపల్లిగూడెంలో సర్వే
- జులై 2న హక్కు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు


రీ సర్వే రికార్డులను కంప్యూటరీకరణ చేస్తున్న ప్లానింగ్ కార్యదర్శులు

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూసురక్ష పథకం కింద జిల్లాలోని తాడేపల్లిగూడెం పట్టణంలో ఫైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన సర్వే తుదిదశకు చేరుకుంది. గ్రౌండ్ ట్రూటింగ్ దగ్గర నుంచి డ్రోన్ మ్యాపింగ్, డ్రోన్ సర్వేతో ఇమేజ్ మ్యాపింగ్ వంటి ప్రక్రియలు దాదాపుగా పూర్తయ్యాయి. మొత్తం వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నారు. అభ్యంతరాలున్న ఆస్తుల వివరాలను వీడియో మ్యాపులను ట్యాబులలోకి పంపించి పరిశీలన చేస్తున్నారు. హక్కు పత్రాలను ముద్రించి యజమానులకు అందజేసేందుకు సిద్ధం చేస్తున్నారు. జులై రెండోతేదీన రాష్ట్రంలో ఈ పథకం కింద తాడేపల్లిగూడెం, రేపల్లె మునిసిపాలిటీలలో లబ్ధిదారులకు వీటిని అందజేయనున్నారు. రాష్ట్రంలో మొత్తం 50 లక్షల ఆస్తులకు సంబంధించి రీసర్వే ప్రక్రియ చేసి హక్కుపత్రాలు అందజేయనుండగా, ఈ క్రమంలో తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో వీటి పంపిణీకి సర్వే అధికారులు, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులు కంప్యూటరీకరణ, ట్యాబ్‌లలో సమాచారం నిక్షిప్తం చేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.

తాడేపల్లిగూడెంలో 30 వేల ఆస్తులు

తాడేపల్లిగూడెం మునిసిపాలిటీలో మొత్తం 30 వేల ఆస్తులకు గాను రీసర్వే పూర్తయ్యింది. వ్యవసాయ, ఖాళీ స్థలాలకు సంబంధించి కొంత సర్వే పెండింగ్‌లో ఉంది. ప్రతిపాదిత విలీనగ్రామాలు మినహా పట్టణ విస్తీర్ణం 23.80 చదరపు కిలోమీటర్లు కాగా, 35 వార్డులలో ఉన్న మొత్తం ఆస్తుల విస్తీర్ణం 5,900 ఎకరాలు ఉంది. అలాగే వ్యవసాయ భూములు 2,050 ఎకరాల్లో, అభివృద్ధి చెందిన ఆస్తులు కలిగిన ప్రాంతం 2,350 ఎకరాల్లో, ప్రభుత్వ భూములు 1,500 ఎకరాల్లో ఉన్నట్లు తేల్చారు. గ్రౌండ్‌ట్రూటింగ్ నుంచి హక్కుపత్రాల తయారీ వరకు దాదాపుగా ప్రక్రియ పూర్తయ్యింది. డ్రోన్ సర్వేలో చెట్లు లాంటివి అడ్డువస్తే అలాంటి ఆస్తులకు జీపీఎస్ రోవర్లతో మ్యాపింగ్ చేశారు. రోవర్ల మ్యాపింగ్‌కు అవకాశం లేని ఆస్తులను క్వాంటమ్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (క్యూజీఐఎస్) పద్ధతిలో గుర్తిస్తున్నారు. ఖాళీస్థలాలు, ఇతర ప్రాంతాలలో నివాసం ఉంటూ అందుబాటులోనికి రాని ఆస్తులు విస్తీర్ణంలో 20 శాతం వరకు ఉన్నాయి. వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఆయా యజమానులకు సమాచారం అందిస్తున్నారు.


రోవర్‌తో పట్టణంలో పాయింట్లు తీస్తున్న వార్డు ప్లానింగ్ కార్యదర్శులు

జూన్ 30 నాటికి హక్కు పత్రాల ముద్రణ

పట్టణంలో ఉన్న 30 వేల ఆస్తులకు సంబంధించి రీ సర్వే పూర్తి చేసిన ఆస్తులకు గాను ఆయా యజమానులకు జూన్ ఒకటి నుంచి 15 వరకు ఆస్తుల మ్యాప్‌లతో పాటు నోటీసులు ఇవ్వనున్నారు. జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు హక్కు పత్రాల ముద్రణ, జులై రెండో తేదీన పంపిణీ చేయడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. సమగ్ర సమాచారం ట్యాబ్‌లలో నిక్షిప్తం చేయడానికి గాను ప్లానింగ్ కార్యదర్శులకు శిక్షణ పూర్తి చేశారు. మొత్తం వివరాలను కంప్యూటరీకరణ చేస్తున్నారు.

బార్‌కోడ్ ఆధారం

ఆస్తుల వివరాలను ఇక యజమానులు తెలుసుకోవాలంటే హక్కుపత్రాలపై ఉన్న బార్‌కోడ్ స్కాన్ చేస్తే చాలు సమాచారం వస్తుంది. అర్బన్ ల్యాండ్ ప్రోపర్టీ పార్సిల్‌లో మ్యాప్‌తో పాటు ఉన్న పార్సిల్ నంబర్‌ను వార్డు సచివాలయాలకు చెబితే ఆస్తుల వివరాలు తెలుసుకునే వెసులుబాటు ఉంది.

హద్దులకు సర్వేరాళ్లు

రీ సర్వేలో భాగంగా గ్రామీణ ప్రాంతంలో ఆస్తులకు సరిహద్దులలో వ్యవసాయ భూములకు, ప్రభుత్వ భూములకు సర్వే రాళ్లను వేస్తారు. పంచాయతీరాజ్ విభాగం, రెవెన్యూ విభాగాలను ఈ ప్రక్రియను చూస్తున్నాయి. సర్వే రాళ్లు వేసే బాధ్యతను అన్ని ఆస్తుల సరిహద్దులకు మునిసిపాలిటీ తీసుకుంది. పట్టణంలో ఈ ప్రక్రియను వేగవంతం చేసే పనిలో పట్టణ సర్వేయర్‌తో పాటు, వార్డు రెగ్యులేషన్ ప్లానింగ్ కార్యదర్శులతో పాటు, వీఆర్‌ఓలతో కలిసి 50 మంది పనిచేస్తున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు
1,149 మంది గైర్హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసిన 69 కేంద్రాల్లో 20,782 మంది విద్యార్థులకు గాను 19,633 మంది హాజరు కాగా, 1,149 మంది గైర్హాజరయ్యారు. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గణితం–1బీ, జువాలజీ –1, హిస్టరీ–1, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణితం –2బీ, జువాలజీ –2, హిస్టరీ –2 పరీక్షలు నిర్వహించారు.

ప్రథమ సంవత్సరం..

ప్రథమ సంవత్సరం పరీక్షలకు ఏలూరు జిల్లాలో 24 కేంద్రాల్లో 4,661 మంది జనరల్ విద్యార్థులకు గాను 4,441 మంది హాజరు కాగా 220 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 292 మందికి గాను 243 మంది హాజరు కాగా 49 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 34 కేంద్రాల్లో 8,677 మంది జనరల్ విద్యార్థులకు గాను 8,321 మంది హాజరు కాగా 356 మంది గైర్హాజరయ్యారు. 357 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 301 మంది హాజరు కాగా 56 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 11 కేంద్రాల్లో 2,122 మంది జనరల్ విద్యార్థులకు గాను 2,036 మంది హాజరు కాగా, 86 మంది గైర్హాజరయ్యారు. 181 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 161 మంది హాజరు కాగా, 20 మంది గైర్హాజరయ్యారు.

ద్వితీయ సంవత్సరం..

ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఏలూరు జిల్లాలో 24 కేంద్రాల్లో 1,305 మంది జనరల్ విద్యార్థులకు గాను 1,194 మంది హాజరు కాగా, 111 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 188 మందికి 106 మంది హాజరు కాగా 82 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 34 కేంద్రాల్లో 2,298 మంది జనరల్ విద్యార్థులకు 2,147 మంది హాజరు కాగా 151 మంది గైర్హాజరయ్యారు. 209 మంది ఒకేషనల్ విద్యార్థులకు 182 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 11 కేంద్రాల్లో 418 మంది జనరల్ విద్యార్థులకు 380 మంది హాజరు కాగా 38 మంది గైర్హాజరయ్యారు. 74 మంది ఒకేషనల్ విద్యార్థులకు 67 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. థియరీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు చెప్పారు.

గడపగడపకు సంక్షేమం


తాడేపల్లిగూడెం రూరల్ : అప్పారావుపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు

నూజివీడు: ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవడతాయని 17వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ యాదవ్ అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలో 17వ ఆంధ్ర బెటాలియన్ విజయవాడ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. 572 మంది క్యాడెట్లు పాల్గొన్న ఈ శిక్షణ శిబిరాన్ని జూన్ 4వ తేదీ వరకు కొనసాగనుంది. దీనిలో ప్రతిరోజూ ఫైరింగ్, డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, మ్యాప్ రీడింగ్, శత్రు శిబిరాలపై పరిశోధన, ఆటలు, క్రీడలు, ఆత్మరక్షణ, ఆరోగ్య పరిరక్షణ, యుద్ధం, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో సహాయ కార్యక్రమాల నిర్వహణ, నాయకత్వ లక్షణాల పెంపుదల తదితర అంశాలపై శిక్షణనిస్తారు.


నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఎన్‌సీసీ క్యాంప్‌లో మాట్లాడుతున్న రాకేష్ యాదవ్

క్యాడెట్‌లను ఉద్దేశించి రాకేష్ యాదవ్ మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరైన ఎన్‌సీసీపై యువత ఎక్కువ ఆసక్తి చూపుతున్నారన్నారు. జాతీయతాభావం, ఐక్యమత్యం, నైతికతతో పాటు ఆర్మీలో శిక్షణ, సామాజిక సేవల్లో భాగస్వాములు కావడానికి, తామనుకున్న లక్ష్యాలను ఛేదించడానికి ఎన్‌సీసీ సరైన వేదికన్నారు. వచ్చే జనవరిలో ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌నకు, తల్‌సైనిక్ క్యాంప్‌నకు అవసరమైన కేడెట్‌లను ఈ శిబిరం ద్వారానే ఎంపిక చేస్తామన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ ఏకే రిషి సందర్శించి ఎన్‌సీసీ ప్రాముఖ్యతను క్యాడెట్స్‌కు వివరించారు. ఈ శిబిరానికి డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ సురేంద్రన్, క్యాంప్ అడ్జుడెంట్ లెఫ్టినెంట్ సీహెచ్‌ఎస్ఆర్ నవీన్ కుమార్ వ్యవహరించారు. ఈ క్యాంప్‌లో వివిధ పాఠశాలలు, కళాశాలలు నుంచి 12 మంది ఎన్‌సీసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

31, జూన్ 1న 'ఖేలో ఇండియా' ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఏలూరులోని స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్‌లో మే 31, జూన్ 1వ తేదీన క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి డి.వినాయక్‌ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అండర్–14, 16, 18 విభాగాల్లో అథ్లెటిక్స్‌లో బాలబాలికలకు, వెయిట్‌లిఫ్టింగ్ అంశంలో బాలికలకు మాత్రమే ఎంపిక పోటీలు చేపడతామన్నారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు గెజిటెడ్ ఆఫీసర్‌తో ధ్రువీకరించిన 10వ తరగతి మార్కుల జాబితా లేదా తహసీల్దార్ జారీ చేసిన జనన ధ్రువీకరణపత్రం, ఆధార్, 3 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, డాక్టర్ జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో పాటు క్రీడల్లో సాధించిన సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఉచిత హాస్టల్, భోజన వసతి, స్పోర్ట్స్ కిట్, స్కూల్ ఫీజు కోసం రూ.1000, వ్యక్తిగత బీమా అందించి అనుభవం కల్గిన కోచ్‌లతో క్రీడల్లో ఏడాది పాటు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 98853 12356 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు

భీమవరం అర్బన్: మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు భీమవరం రూరల్ ఎస్సై మోహన్ రావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. నరసింహపురానికి చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన నార్కిమెల్లి జాన్‌ప్రకాష్ తన వద్దకు రమ్మని వేధిస్తున్నాడు. ఇతనికి తోట యాకోబు సహకరిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పెనుమంట్ర: ఇద్దరు బాలురు బైక్ వేగంగా నడుపుతూ వేరొక బైక్‌ను, నడిచివెళుతున్న వృద్ధురాలిని ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నరసాపురానికి చెందిన మేడిచర్ల కృష్ణ, ముత్యాల ఆదినారాయణ బుల్లెట్‌పై శనివారం పెరవలి వెళుతుండగా, నెగ్గిపూడి సమీపంలో మార్టేరు – పెనుగొండ రోడ్డులో ఇద్దరు బాలురు బైక్‌పై వేగంగా వస్తూ ఢీకొనడమే కాక అదే సమయంలో రోడ్డు దాటుతున్న నెగ్గిపూడికి చెందిన మన్నే లక్ష్మి అనే వృద్ధురాలిని ఢీకొన్నారు. గాయాలపాలైన వీరిని 108లో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్‌ఐ వి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్మాగారాల్లో మిథనాల్ నిల్వల తనిఖీలు

తణుకు: తణుకు పరిసర ప్రాంతాల్లోని పలు కర్మాగారాల్లో ఎస్‌ఈబీ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రాసుగర్స్, వాన్‌బరీ, ష్లాటస్ కర్మాగారాల్లో ఆర్ఎస్, మిథనాల్ యూనిట్లను అధికారులు పరిశీలించి సంస్థ యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఆర్ఎస్, మిథనాల్ విషయంలో అజాగ్రత్త వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసి ట్యాంకర్లు దిగుమతి, ఎగుమతి సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఈబీ జిల్లా అధికారి ఏటీవీ రవికుమార్, ఎస్‌ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ, తణుకు ఎస్‌ఈబీ సీఐ ఆర్.సత్యవతి, ఎస్సై టి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


తణుకులోని ఓ కర్మాగారంలో తనిఖీ చేస్తున్న ఎస్‌ఈబీ, ఎక్సైజ్ శాఖల అధికారులు

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఏలూరు టౌన్ : ఏలూరులో మోటార్‌సైకిల్‌పై గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు చెప్పారు. శనివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఏలూరులో గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ తమ సిబ్బందితో తంగెళ్లమూడిలోని దాసాంజనేయ స్వామి గుడి వద్ద మాటు వేశారు. అదే సమయంలో పవర్‌పేట ప్రాంతానికి చెందిన రాగి నాగేశ్వరరావు, గేదెల సతీష్ అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై గంజాయిని మూటలుగా కట్టి తీసుకువెళుతుండగా, పోలీసులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. గేదెల సతీష్ మోటారు సైకిల్ నుంచి దూకి పారిపోగా, రాగి నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రెండు కిలోల బరువు కలిగిన సుమారు రూ.2.40 లక్షల విలువైన 12 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు తహసీల్దార్ సమక్షంలో నిందితులను విచారించి వారిపై మేరకు కేసు నమోదు చేశారు.

మరో ఇద్దరిని గంజాయి కేసులో ఇరికించాలని..

తంగెళ్లమూడిలోని శివగోపాలపురం ప్రాంతానికి చెందిన జూలూరు శేషగిరిరావు, జూలూరు గణేష్ అన్నదమ్ములు. వీరు గతంలో నీలిమందు, గుట్కా వ్యాపారం చేస్తుండేవారు. వీరి వద్ద 2020 సంవత్సరంలో డ్రైవర్లుగా నాగేశ్వరరావు, గేదెల సతీష్ పని చేసి మానేశారు. అనంతరం సతీష్, నాగేశ్వరరావు ఇద్దరూ జూలూరు బ్రదర్స్ వద్ద గుట్కాలు కొనుగోలు చేసి విక్రయిస్తూ ఉండేవారు. కరోనా కారణంగా కొంతకాలం గుట్కా వ్యాపారాన్ని నిలిపివేశారు. ప్రస్తుతం మళ్ళీ గుట్కా వ్యాపారం చేసేందుకు ప్రయత్నించగా జూలూరు బ్రదర్స్ అంగీకరించలేదు. వారిపై కక్ష పెంచుకున్న సతీష్, నాగేశ్వరరావు వారిని గంజాయి కేసులో ఇరికించాలని నిర్ణయించి ఇద్దరూ బండిపై గంజాయి తీసుకుని జూలూరు బ్రదర్స్ గోడౌన్‌లో పెట్టేందుకు వెళుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. పరారీలో ఉన్న సతీష్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు చిత్రంలో సీఐ చంద్రశేఖర్

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు, వేసవి సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పురాజ గోపుర ప్రాంతాలతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ అనివేటి మండపంలో తిరుమల తిరుపతి దాససాహిత్యా ప్రాజెక్టుకు చెందిన పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా దేవస్థానం అధికారులు, సిబ్బంది వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.


ఆలయంలో భక్తుల రద్దీ

మంచు తెర... భానుడి సెగ!

- తెల్లవారు జామున మంచుదుప్పటి
- ఆపై తారాస్థాయిలో ఉష్ణోగ్రతలు
- భానుడి ప్రభావంతో జనం విలవిల
- ఎండల ధాటికి రోడ్లు నిర్మానుష్యం

పెంటపాడు: మండువేసవిలో వింత వాతావరణంతో ప్రజలు ఆశ్చర్యచకితులవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెలలో అకాల వర్షాలు కురిసాయి. దీనికి తోడు వారం క్రితం ఒక సారి, శనివారం ఉదయం పూట దట్టంగా కమ్ముకుంటున్న మంచు కనిపించింది. ఆపై ఠారెత్తిస్తున్న ఎండలు దీంతో అన్ని కాలాలను మే నెలలో చూస్తున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏ నిమషంలో వానవస్తుందో, ఎండ కాస్తుందో తెలియని పరిస్థితిలో ప్రజలు ఉన్నారు. వీటికి తోడు పొగమంచు పరుగులు పెట్టిస్తోందని ఆక్వా రైతులు గగ్గోలు పెడుతున్నారు. శనివారం పలు ప్రాంతాల్లో వింత వాతావరణం చోటు చేసుకొంది. తెల్లవారు జాము నుంచి విపరీతంగా మంచు కురిసింది. ఈ కారణంగా వాతావరణం చల్లబడుతుందనుకొంటే అలా కొద్ది సేపటికి మంచు దుప్పటి వెళ్లగానే ఉదయం నుండే భానుడు నిప్పులు కక్కాడు. భారీగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఎండవేడిమి భరించలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఉక్కపోత కూడా అల్లాడించింది. ప్రజలు ఏసీలు వేసుకొని ఇళ్లలోనే ఉన్నారు. పలు ప్రాంతాల్లో 40 నుంచి 46 డిగ్రీలవరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉదయం నుండే వడగాల్పులు వీచాయి. సాధారణంగా శని, ఆదివారాలు సెలవుదినం కావడంతో మార్కెట్‌లు బిజీగా కనిపిస్తాయి. అయితే ఎండ తీవ్రతతో మార్కెట్‌లు కూడా వెలవెలబోయాయి. మధ్యాహ్నం గూడెం పట్టణంలోని రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. మరో మూడు రోజులు భారీగానే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావారణ శాఖ ఆదేశాలు జారీచేసింది.

కమ్మేసిన మంచుదుప్పటి:

పలు ప్రాంతాల్లో శనివారం తెల్లవారు జామునుంచే మంచుదుప్పటి కమ్మేసింది. మంచు తీవ్రత కారణంగా రహదారులపై వాహనాలు ప్రయాణించడం కష్టతరంగా తయారైంది. లైట్లు వేసుకొని ప్రయాణించారు. మండలంలో మంచుకురిసింది. ఈ ఉధృతివల్ల రైతులు వర్షం అనుకొని కంగారుపడ్డారు. వేసవిలో ఇంతలా మంచుకురవడం గతంలో చూడలేదని చెబుతున్నారు. పెంటపాడు మండలం జట్లపాలెం, రాచర్ల రోడ్లలో మంచు కప్పేసింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. తెల్లవారు జామున కురిసిన మంచు వల్ల చేపలు, రొయ్యలు ముట్టెలు పైకెత్తినట్లు ఆక్వా రైతులు చెబుతున్నారు. ఒక్కసారిగా వాతావరణం మారడంతో రైతులు ఏరియేటర్లు తిప్పుతూ ఆక్సిజన్ లోప నివారణ కోసం మందులు చల్లారు. మండు వేసవిలో అకాల వర్షాలతో ఆందోళన చెందుతుంటే మూలిగేనక్కపై తాటికాయ పడ్డట్లు ఆక్వారైతులు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు ఎండ తీవ్రతతో పాటు, విద్యుత్ అంతరాయాలతో ప్రజలు విలవిలలాడారు. దాదాపు రెండు గంటల పాటు, అప్రకటితంగా కోతలు విధిస్తున్నారు.

అల్లాడుతున్న మూగజీవాలు:

కొద్ది రోజులుగా శాంతించిన భానుడు రెండు రోజులుగా ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎండకు సైతం మనుష్యులే కాదు, పశుపక్ష్యాదులు అల్లాడుతున్నాయి. ఎండ వేడిమికి ఉపశమనం పొందేందుకు అవికాస్తా చల్లని ప్రదేశం వైపు పరుగులు తీస్తున్నాయి. మిడ్‌లెవిల్ కాలవలో ఉన్న కొద్దిపాటి నీళ్లలో పశువులు సేదదీరగా, జట్లపాలెంలో గుర్రపుడెక్కతో ఉన్న పశువుల చెరువులో బురదలో పశువులు ఉదయం నుంచి చెరువు నుంచి బయటకు రాలేదు.


ప్రత్తిపాడులో ఎండను తట్టుకోలేక చీరకొంగు నీడన వెళ్తున్న వృద్ధ మహిళలు


జట్లపాలెం రోడ్డులో శనివారం ఉదయం కమ్మేసిన మంచులో ప్రయాణిస్తున్న వ్యాన్

క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న వాకర్స్‌సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎఫ్‌సీఐ కాలనీలోని పారిశుధ్య కార్మికులకు దాత గజలక్ష్మి సౌజన్యంతో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కేవీ చలం మాట్లాడుతూ కార్మికులు అందిస్తున్న సేవాలకు గాను ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పి.కుమార్‌స్వామి, కోశాధికారి పీవీ పరమాత్మ, మాజీ గవర్నర్ కె.నరసింహమూర్తి, డిప్యూటీ గవర్నర్ వీఎస్ ప్రసాద్, ఎఫ్‌సీఐ కాలనీ అధ్యక్షుడు ఎం.రంగారావు, నాగరాజు, సారధి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జువ్వలపాలెంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


తాడేపల్లిగూడెం పట్టణ పరిధి జువ్వలపాలెంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ పరిధి జువ్వలపాలెంలో శనివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. జిల్లా పారామిలటరీ మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో రాధా కృష్ణ కామధేను వద్ద ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. పాదచారులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేసి, వారి దాహార్తిని తీర్చారు. స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరాల వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరిపారు. ఉదయం అర్చకులు స్వామికి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. పరిసర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి


వేల్పూరు జగనన్న కాలనీలో సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తణుకు టౌన్ : నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు చెప్పారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని కావలిపురం రోడ్డులో గల జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీడీవో టీఎస్ మూర్తి, గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకటరెడ్డి, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ


డ్రోన్ల వినియోగ శిక్షణలో పాల్గొన్న రైతులు

తాడేపల్లిగూడెం: డ్రోన్ల వినియోగంతో అనేక ఉపయోగాలున్నాయని, వీటి వినియోగంలో జాగ్రత్తలు అవసరమని శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. వెంకట్రామన్నగూడెం కెవికె ద్వారా డ్రోన్ల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు , పిచికారీ చేసే సమయంలో పాటించాల్సిన పద్ధతులు, డ్రోన్ల వినియోగం తర్వాత ఏం చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, వ్యవసాయ సాంకేతిక విజ్ఞాన ప్రయోగసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉంగుటూరు, ద్వారకాతిరుమలలోని కైకరం, చేబ్రోలు, నారాయణపురం, బుట్టాయగూడెం, రాళ్లకుంట గ్రామాల రైతులకు ఈ శిక్షణను ఇచ్చారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.రాఘవేంద్రరెడ్డి, జి.శాలిరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చిట్యాల సురేంద్ర కుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుండెపోటు వచ్చిన సమయంలో లైఫ్ సేవింగ్ టెక్నిక్స్ (సీపీఆర్) ద్వారా వట్టి చేతులతో హృదయ శ్వాసకోశ పునర్జీవనం ఏ విధంగా చేయవచ్చో అవగాహన కార్యక్రమం శనివారం ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ ఆవరణలో ఆత్మబంధువులం సేవా సంఘం వారిచే నిర్వహించారు. డాక్టర్ చిట్యాల సురేంద్ర కుమార్ హాజరై వివిధ టెక్నిక్స్‌ను వాకర్స్ సభ్యులకు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె నొప్పి కలిగినా, ఆది ఆగినా వెను వెంటనే తిరిగి మరల వెంటనే పునరుత్తేజపరిస్తే మనిషి ప్రాణపాయం నుంచి బయట పడతారని తెలిపారు. సీపీఆర్ టెక్నిక్స్ ఎప్పుడు, ఎలాంటి పరిస్థితుల్లో, ఏ లక్షణాలు ఉన్న వ్యక్తికి ఉపయోగించాలో తప్పనిసరిగా అందరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు ఫౌండర్ శీతాల ఉషాకిరణ్, అధ్యక్షుడు కడియాల పరశురామయ్య, ఉపాధ్యక్షుడు టి.సూరిబాబు, కోశాధికారి కేవీ చలం, పీఆర్‌ఓ పాలూరి శ్రీనివాసరావు, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్రపరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ ఉచిత సేవా ఆసుపత్రిలో ఆదివారం ఉచిత కంటి వైద్యపరీక్షలు చేయనున్నట్లు ట్రస్టీ కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసి కళ్లజోళ్లు రాయితీపై అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- అప్పారావుపేటలో గడపగడపకు మన ప్రభుత్వం


తాడేపల్లిగూడెం రూరల్: పేదలు ఆర్థిక పరిపుష్టి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు.శనివారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమన్నారు. ప్రతి ఇంటికి జగనన్న సంక్షేమ పథకాలు ద్వారా అందిన లబ్ధిని వివరిస్తుంటే ఆయా కుటుంబాల్లో ఎంతో సంతోషం కనిపిస్తోందన్నారు. సమాజంలో అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. 2014లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయమని చెప్పిన పవన్ కళ్యాణ్ ఆ తర్వాత ఐదేళ్లల్లో ఏనాడైనా తెలుగుదేశం ప్రభుత్వాన్ని, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును హామీలు అమలు చేయలేదని నిలదీశారా ?అని ప్రశ్నించారు. నేడు కాపులను చంద్రబాబుకు తాకట్టు పెట్టేందుకు పవన్ కల్యాణ్ సిద్ధమయ్యాడని విమర్శించారు. శాంతి భద్రతలను కాపాడి అభివృద్ధికి పాటుపడేది ఎవరనేది అప్పారావుపేట ప్రజలు ఆలోచించాలని మంత్రి కొట్టు కోరారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా గ్రామం అభివృద్ధి జరిగిందన్నారు. ఆ తర్వాత పదేళ్ల పాటు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేశారన్నారు. ఎవరి హయాంలో ఏం జరిగిందనేది ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, వెలిశెట్టి నరేంద్రకుమార్, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, అడపా హరిబాబు, కోరశిఖ నాగరాజు, కడప విష్ణు, మాదేపల్లి సూర్యనారాయణ, నారపురెడ్డి సూర్యనారాయణ, రాపాక వెంకటేష్, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావురావుపేట గ్రామానికి చెందిన మాదేపల్లి నాగరాజు ఆధ్వర్యంలో 200మంది జనసైనికులు శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్న వారికి తగిన గుర్తింపు, గౌరవం దక్కుతుందన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషలత, వైస్ ఎంపీపీలు కట్టా రంగబాబు, సూర్పని రామకృష్ణ, సర్పంచ్ ఎలిసే గాంధీ, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జద్దు హరిబాబు,మండల సేవాదళ్ చైర్మన్ కొండుబోయిన కృపావరం, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటి కన్వీనర్ మాదేపల్లి సూర్యనారాయణ, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, అడపా హరిబాబు, వీర్ల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు


అత్తిలిశాఖా గ్రంథాలయంలో యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెంలో వేసవి శిబిరంలో ఆటలాడుతున్న విద్యార్థులు

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడంపై రిసోర్సు పర్సన్ జ్యోతిలత శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్‌పై శిక్షణ ఇచ్చారు. యోగా, శతక పద్యాలపై కె కోమలి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి వెంకటేశ్వరరావు, వి గణపతి, ఆర్ దానకృష్ణ, ఎం శ్రీదేవి, గ్రంథపాలకుడు డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా కొనసాగుతున్న వేసవి శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్ -1 గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం ఉల్లాసంగా కొనసాగుతుంది. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో శనివారం వివిధ పాఠ్యాంశాల్లో అవగాహనతో పాటు మెడిటేషన్, మానవుని జీర్ణ వ్యవస్థ, రాజ్యాంగం, రచన, నిబంధనలు బోధించారు. ఆటలు ఆడించారు. దేశభక్తి గీతాలు ఆలపించారు. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని నిర్వహించి ఆయన జీవిత విశేషాలను వెల్లడించారు. ప్రత్తి వీరాస్వామి, దుర్గమ్మ, ఎస్.సాల్మన్‌రాజు, బాపయ్య శర్మ, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు


తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శనివారం తణుకు పట్టణంలో బ్యాంక్ కాలనీలో గల పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు యర్రమిల్లి ప్రభాకర్ చేతి రాత పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రీసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష, ఇంగ్లీష్ పదాలకు అర్థాలు వివరణ, వంటి వాటితో పాటు కథలు చెప్పడం, యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.

సమన్వయంతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్

తాడేపల్లిగూడెం రూరల్: అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఇంటి నిర్మాణాలపై ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి దుర్గేష్ మాట్లాడుతూ మండలం మొత్తం 3075 ఇళ్లు మంజూరు కాగా, 2437 ఇళ్లు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1751 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మరో 638 ఇళ్లు చేపట్టవలసి ఉందని, మరో 147 ఇళ్లు శ్లాబ్ దశలో ఉన్నాయని వివరించారు. బేస్‌మెంట్, రూఫ్ లెవల్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. జులై నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 304 ఇళ్లు పూర్తి చేయాలన్నారు. సొంత స్థలం ఉండి ఇంటి నిర్మాణాలు చేపట్టి బిల్లులు కాకుండా ఉన్న 25 ఇళ్లకు త్వరితగతిన బిల్లులు చేయాలన్నారు. తహసీల్దార్ వైకేవీ.అప్పారావు మాట్లాడుతూ ఇంటి నిర్మాణాల విషయంలో ఏ విధమైన సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఇంకా ఇంటి నిర్మాణాలు చేపట్టని వారి స్థితిగతులను పరిశీలించి, కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో వీఎస్.వేణుగోపాల్, హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, ఈవోపీఆర్‌డీ కె.వెంకటేష్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, నోడల్ అధికారి ఆర్ఎస్.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు వి.వాణి, కె.శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీ.బ్రహ్మం, కె.రమేష్, బి.రమేష్, బి.ఫణికుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తాం


నూతన కమిటీని అభినందిస్తున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఇతర సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అందరి సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం డైమండ్స్ నూతన అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య తెలిపారు. పట్టణంలోని కార్యాలయం వద్ద శనివారం జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు వివరాలను వెల్లడించారు. కార్యదర్శులుగా మద్దుకూరి మెహర్‌ప్రసాద్, కాళ్ళ గోపీకృష్ణ, కోశాధికారిగా మునగాల జితేంద్ర, ఉపాధ్యక్షుడిగా వేగేశ్న రామరాజు, బోళ్ళ రాము, బుద్దాల విజయ్‌బాబు, కోటి విజయ్ కిషోర్‌లు, అదే విధంగా ఎల్‌సీఐఎఫ్ చైర్‌పర్సన్‌గా కోనా హనుమాన్, సర్వీస్ చైర్‌పర్సన్‌గా కోనా శ్రీనివాస్‌లు, మరికొంత మంది సభ్యులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నూతన గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, ఆర్‌సీ మదన్‌మోహన్ అగర్వాల్‌లు నూతనంగా ఎంపికైన డైమండ్స్ సభ్యులను అభినందించారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

కాళ్ల : ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ, కొండాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంర్భంగా భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పీవీఎల్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో గ్రామమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సర్పంచ్ భూపతి జగ్గారాజు, ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, ఆలయ కమిటీ చైర్మన్ వక్కపట్ల హరిబాబు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా సేవలందించాలి


పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్ల సన్మానం అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు, పార్టీ నాయకులు

పెంటపాడు : గ్రామ వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి పేర్కొన్నారు. పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్ల సేవలను గుర్తించి శనివారం సాయంత్రం పార్టీ నాయకులు సన్మానం చేశారు. ప్రతిభ కనపరచిన వారిని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచనల మేరకు నగదు పురస్కారాలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా వలంటీర్లు స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి బాబి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు పేదలకు అందజేయడంతో వలంటీర్లు పాత్ర మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు కొవ్వూరి భాస్కరరెడ్డి, కొలుపూరి శివకిరణ్, బర్ల జయరాంబాబు, వార్డు సభ్యులు కాసారపు శ్రీను, రెడ్డి శ్రీను, ముత్యప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి రామారావు పంచాయతీ సిబ్బంది, పార్టీ నాయకులు, జగన్, రెడ్డి యూత్ సభ్యులు పాల్గొన్నారు.